
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 13 । అక్టోబర్ । 2025



సోమశిలలో 74.066 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో ఆదివారానికి 74.066 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 8500 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నానదికి 10,150, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 3800 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,26,060
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.11,390
3 శాతం జీఎస్టీతో	రూ.11,731
నవర (8 గ్రా)	రూ.93,848

గరిష్ఠం/కనిష్ఠం
34.5 /26.8

వాతావరణం
జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా, అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. ఆదివారం గాలిలో తేమ 68 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

కాకాణితో చంద్రశేఖర్‌రెడ్డి భేటీ



కాకాణితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు పొదలకూరురోడ్డులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ఆదివారం ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాల కార్యాచరణ, భవిష్యత్ రాజకీయ వ్యవహారాలపై చర్చించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నెల్లూరురూరల్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీ స్థితి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 84,571 మంది స్వామి వారిని దర్శించుకోగా 36, 711 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.70 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కూటమిలో బియ్యం కయ్యం

›› జిల్లాలో బరితెగించిన రేషన్ మాఫియా

నెల్లూరు కేంద్రంగా చెలరేగుతున్న రేషన్ మాఫియా వ్యవహారం ఇప్పుడు కూటమిలో కుంపటి రాజేసింది. ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్ కడప, ప్రకాశం జిల్లాల నుంచి రేషన్ బియ్యం సేకరించి అక్రమ రవాణా జరుగుతుందని 'సాక్షి' అనేక దఫాలుగా సాక్ష్యాధారాలతో వెలుగులోకి తెచ్చింది. ఇటీవల టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తాజాగా ఆ పార్టీ నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి రేషన్ మాఫియాపై బాహాటంగా చేసిన ఆరోపణలు రేషన్ అక్రమ రవాణాను రుజువు చేస్తున్నాయి. డీసీఎం పవన్‌కల్యాణ్ కీలక అనుచరుడు నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్నారని, ఈ మాఫియాపై ఆయన విచారణ జరిపించాలంటూ డిమాండ్ చేయడాన్ని బట్టి చూస్తే ఏ స్థాయిలో రేషన్ బియ్యం అక్రమ రవాణా, వ్యాపారం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

- ప్రతి నెలా 80 శాతం అక్రమ రవాణా
- అది నిజమేనంటూ మొన్న టీడీపీ ఎమ్మెల్యే, నిన్న ఆ పార్టీ నేత, నుడా చైర్మన్ బాహాటంగా ఆరోపణలు
- డీసీఎం పవన్‌కల్యాణ్ కీలక అనుచరుడు, పౌరసరఫరాల శాఖ మంత్రితో విచారణకు డిమాండ్
- దీన్ని బట్టి ఏ స్థాయిలో అక్రమ వ్యాపారం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు
- ఎవరీ డాన్.. ఎందుకు అధికారుల మౌనం
- అందరి వేళ్లు మంత్రి అనుచరుడి వైపే



సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లాలో పేదల కడుపు కొట్టి రేషన్ బియ్యంతో జేబులు నింపుకుంటున్నారంటూ టీడీపీ సీనియర్ నేత, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేసిన ఆరోపణలు కూటమి పార్టీలకు తలనొప్పిగా పరిణమించాయి. పౌరసరఫరాల శాఖ అధికారులపై విమర్శలు చేయడంతోపాటు నాలుగు రోజుల్లో రేషన్ మాఫియాపై చర్యలు తీసుకోకపోతే ఆ వ్యక్తి ఎవరో తానే బయట పెడతానంటూ చేసిన హెచ్చరికలు ప్రభుత్వ పెద్దలతోపాటు అధికారులు ఇరకాటంలో పడ్డారు. జిల్లా నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న ఆ రేషన్ మాఫియా డాన్ ఎవరూ, పౌరసరఫరా శాఖ అధికారులు అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ఎందుకు చేతులెత్తేశారు, వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారనే ప్రశ్నలకు సమాధానం బహిరంగ రహస్యం.

అందరూ 'దొంగాట'

జిల్లాతోపాటు సమీప జిల్లాల నుంచి నేరుగా రేషన్ షాపులు, ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి 80 నుంచి 90 శాతం బియ్యాన్ని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యేల నుంచి మంత్రుల వరకు, పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీస్, విజిలెన్స్ శాఖల అధికారులకు అన్ని స్థాయిల్లో భారీగా ముడుపులు ముట్టజెప్పుతుండడంతోనే అందరూ కలిసి 'దొంగాట' ఆడుతున్నారు. ఇదే విషయాన్ని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి రుఢీ చేస్తూ.. ప్రతి నెలా రూ.కోట్ల విలువైన రేషన్ బియ్యం తరలివెళ్తుంటే అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదంటూ ఆరోపణలు చేశారు. రేషన్ మాఫియాపై చర్యలు తీసుకునేందుకు అధికారులకు చావ చచ్చిందా? చేతగానితనమా? అంటూ అధికార యంత్రాంగాన్ని నిలదీస్తూ, డెడ్‌లైన్ పెట్టే పరిస్థితిని చూస్తే జిల్లాలో ఏ స్థాయిలో రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుంతో అర్థం చేసుకోవచ్చు.

టీడీపీ నేతల కన్నెర్ర ఎందుకు?

జిల్లాలో దాదాపు 16 నెలలుగా రేషన్ మాఫియా చెలరేగుతుంటే.. ఇప్పుడే టీడీపీ ఎమ్మెల్యే, నుడా చైర్మన్‌లు ఎందుకు కన్నెర్ర చేస్తున్నారనేది జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. నెల్లూరు రూరల్ ప్రాంతం సుభాన్‌నగర్‌లో ఇటీవల 5 లారీల్లో రేషన్ బియ్యం తరలిస్తున్నారంటూ టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నేరుగా పౌరసరఫరాల శాఖాధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు వాటి విషయంలో మీనమేషాలు లెక్కిస్తే తాట తీస్తానంటూ హుకుం జారీ చేశారు. అయితే మరుసటి రోజుకు ఏం జరిగిందో తెలియదు కానీ.. పౌరసరఫరాల శాఖాధికారులు ఐదు లారీల్లో రెండు లారీల్లోనే రేషన్ బియ్యమంటూ తేల్చి, మిగతా మూడు లారీల్లో ఇతర సరుకులు ఉన్నాయని వదిలేశారు. ఆ తర్వాత ఈ వ్యవహారంపై ఆయన మౌనం దాల్చారు. తాజాగా ఇదే విషయమై నుడా చైర్మన్ ప్రెస్‌మీట్ పెట్టి రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందంటూ బహిరంగ ఆరోపణలు చేయడం, పౌరసరఫరాల శాఖ అధికారులకు డెడ్‌లైన్ విధించడం, పౌరసరఫరాల శాఖ మంత్రి ద్వారా విచారణ జరిపించాలంటూ డీసీఎం పవన్‌కల్యాణ్‌ను డిమాండ్ చేయడం చూస్తే పెద్ద వ్యూహమే ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

ప్రతి నెలా రూ.కోట్లల్లో వ్యాపారం

జిల్లాలో 1,513 రేషన్ దుకాణాలు ఉండగా 7.22 లక్షల రేషన్ కార్డులకు నెలకు దాదాపు 10,923 టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఇందులో దాదాపు 9 వేల టన్నుల బియ్యం పక్కదారి పడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా కావలి, నెల్లూరులోని శెట్టిగుంటరోడ్డు కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం నుంచి రాజుపాళెం వైపు రహదారిలో ఉన్న రైస్ మిల్లు, పోతిరెడ్డిపాళెం, అల్లీపురం, నెల్లూరు రూరల్ పరిధిలోని గుడిపల్లిపాడు, చెముడుగుంట కందుకూరు నియోజకవర్గంలోని పెదపవనిలో ఉన్న రైస్‌మిల్లుకు తరలించి పాలిష్ పట్టిస్తున్నారు. అక్కడి నుంచి నేరుగా చెన్నై మార్కెట్‌తోపాటు కృష్ణపట్నం పోర్టు ద్వారా విదేశాలకు తరలిస్తున్నారు. నెల్లూరు నగరం, నెల్లూరురూరల్, కోవూరు, ఉదయగిరి, కావలి, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో మాఫియా బియ్యం సేకరణ కోసం ప్రత్యేకంగా టీమ్ ఏర్పాటు చేసుకుంది.

మంత్రి అనుచరుడి వైపే అందరి వేళ్లు..

ఈ రేషన్ మాఫియా వెనుక జిల్లాకు చెందిన ఓ మంత్రి అనుచరుడు ఉన్నారంటూ, ఆయన వైపే అందరి వేళ్లు చూపిస్తున్నారు. సదరు నేత పౌరసరఫరాల శాఖపై పెత్తనం చేస్తుండడంతో రేషన్ అక్రమ రవాణా చేసే వారందరిని జట్టుగా చేసి అక్రమ దందా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. నగరంలో ముగ్గురు, అనంతసాగరం మండలానికి చెందిన మరొకరు ఈ మాఫియాలో కీలకంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. ఆయన కనుసన్నల్లోనే మాఫియా బరి తెగిస్తోందని ఆ పార్టీ నేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ మాఫియాగాళ్లు నియోజకవర్గాల్లో దళారుల ద్వారా బియ్యం సేకరణ చేస్తున్నారు. నెల్లూరుతోపాటు ప్రకాశం, వైఎస్సార్ కడప జిల్లాలో మిల్లులు లీజుకు తీసుకుని ఈ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇటీవల బాపట్ల జిల్లాలో దొరికిన బియ్యం వాహనాలు నెల్లూరుకు చెందిన మాఫియావే కావడం విశేషం. నాలుగు జిల్లాల్లో మంత్రి కీలక అనుచరుడి ద్వారానే దందా నిర్వహిస్తునారనేది జగమెరిగిన సత్యం. నియోజకవర్గాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల షాడోలకు నెలకు రూ.25 లక్షలు ముట్టజెప్పి వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ఎవరూ కూడా రేషన్ బియ్యం దందాను అడ్డుకునే పరిస్థితి లేదు. నెల్లూరు నగర నియోజకవర్గంలో ఎన్టీఆర్ నగరలో ఉన్న మాజీ రేషన్ డీలర్ మాఫియాకు కీరోల్‌గా వ్యవహరిస్తున్నారని సమాచారం. ఏడాదిలోనే ఆయన రేషన్ దందా ద్వారా రూ.10 కోట్లు వరకు సంపాదించినట్లు ఆ పార్టీలో చర్చ జరుగుతోంది.

పేదల ఇళ్ల స్థలాల జోలికి వస్తే ఉపేక్షించం

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: పేదల ఇళ్ల స్థలాలు, ఇళ్ల జోలికి వస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని చవటపాళెంలో ఆదివారం కాకాణి పర్యటించారు. ఈ సందర్భంగా కాకాణి స్థానికులతో కలిసి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లు వేసి పారదర్శకంగా ఇళ్ల స్థలాలు కేటాయించడం జరిగిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలు రద్దు చేయించి ఆ స్థలాలను అప్పనంగా టీడీపీకి చెందిన వారికి కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అర్హత కలిగిన పేదలకు చెందిన ఇళ్ల స్థలాల జోలికి వస్తే అధికారులు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. పేదలకు చెందిన ఇళ్ల స్థలాలను కబ్జా చేయాలని ఎవరు ప్రయత్నించినా క్షమించబోమన్నారు. అధికారులు అత్యుత్సాహంతో పేదల ఇళ్ల పట్టాలు రద్దు చేసేందుకు నోటీసులు ఇస్తే న్యాయ స్థానాన్ని ఆశ్రయించి పేదల పక్షాన పోరాడతామని తెలియజేశారు.



చవటపాళెం గ్రామస్తులతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

దోపిడీపైనే సోమిరెడ్డికి శ్రద్ధ

సర్వేపల్లి నియోజకవర్గాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా దోచుకోవడంపైనే సోమిరెడ్డి, అతని కుమారుడు రాజగోపాల్‌రెడ్డి శ్రద్ధ చూపుతున్నారని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చి 16 నెలలు దాటినా ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సర్వేపల్లిలో గ్రావెల్, ఇసుక, మట్టి బూడిద మాఫియా రోజు రోజుకు పెరిగిపోతుందని ఆరోపించారు. ఎక్కడా లేని విధంగా సర్వేపల్లి నియోజకవర్గంలోని అన్నీ గ్రామాల్లో బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇరిగేషన్ పనులపై విచారణ జరిపితే సర్వేపల్లిలో జరిగిన దోపిడీ బట్టబయలవుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతాంగం అన్నీ విధాలా ఇబ్బందులు పడుతుంటే పట్టించుకునే పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదని, పండించిన పంటకు గిట్టుబాటు లభించక రైతులు ఆగ్రహంతో ఉన్నారని తెలియజేశారు. నకిలీ మద్యం బారిన పడి పేద ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే కూటమి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అనర్హుడికి 'ఆటోడ్రైవర్ల సేవలో'

- సొంత ఆటో లేకుండానే టీడీపీ కార్యకర్తకు పథకం వర్తింపు
- ఆయన స్వతహాగా వ్యవసాయదారుడు
- అర్హులకు దక్కని వైనం

మర్రిపాడు: కూటమి ప్రభుత్వ పాలనలో పథకాలు అర్హత లేకపోయినా తమ్ముళ్లకే దక్కుతున్నాయనేందుకు 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకం దర్పణంగా నిలుస్తోంది. జిల్లాలో సొంత ఆటోలు కలిగిన డ్రైవర్లు సుమారు 40 వేల మంది వరకు ఉన్నారు. వీరందరూ ఈ పథకం లబ్ధి కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ అనేక కొర్రీలు వేసి చివరకు 17,406 మందికి ఈ పథకాన్ని వర్తింప చేశారు. అనర్హుడైన పక్కా టీడీపీ కార్యకర్తకు ఏ విధంగా లబ్ధి చేకూర్చారో అధికారులే సెలవివ్వాల్సి ఉంది. నిరుపేద ఆటోడ్రైవర్లకు ఆర్థికంగా అండగా నిలబడేందుకు అంటూ ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెప్పినా.. అమల్లో మాత్రం రాజకీయ సిఫారసులకు ప్రాధాన్యత లభించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మర్రిపాడు మండలంలోని పల్లవోలు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ముప్పాళ్ల జయవర్ధన్‌కు అసలు ఆటోనే లేదు. అతను ఆటో డ్రైవర్ కూడా కాదు. జయవర్ధన్ వ్యవసాయం చేస్తుంటాడు. అయినా 'ఆటోడ్రైవర్ల సేవలో' లబ్ధిదారుడిగా ఎంపిక కావడం స్థానికుల్లో చర్చనీయాంశమైంది. జయవర్ధన్‌కు AP39 UX3918 నంబరుతో ఆటో ఉన్నట్లు లబ్ధిదారుల జాబితాలో చూపించారు. రవాణాశాఖ రికార్డుల ప్రకారం ఈ ఆటోకు మర్రిపాడు మండలం వెంగంపల్లి పంచాయతీలోని భీమవరం గ్రామానికి చెందిన గోవిందు కృష్ణారెడ్డి యజమానిగా ఉన్నారు. జయవర్ధన్ ఎవరిదో ఆటోలో కూర్చొని ఫొటో తీసుకుని 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకం దరఖాస్తుతో జతచేసి, ఆటోడ్రైవర్‌లా చూపించి పథకాన్ని పొందినట్లు తెలుస్తోంది. దీనిపై గ్రామస్తులు సైతం ఎంపీడీఓకు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఇదే గ్రామానికి చెందిన అర్హుడైన షేక్ అజామ్ అనే ఆటో డ్రైవర్‌కు లబ్ధి చేకూరలేదు. అర్హులైన ఆటోడ్రైవర్లకు చేకూరాల్సిన పథకాన్ని టీడీపీ నేతలు తప్పుడు ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుని లబ్ధిపొందుతున్నారని అర్హులైన లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.



ఆటోడ్రైవర్ల సేవలో' లబ్ధిదారుల జాబితాలో టీడీపీ కార్యకర్త ముప్పాళ్ల జయవర్ధన్ పేరు



ముప్పాళ్ల జయవర్ధన్ లబ్ధిపొందిన ఆటో నంబరు యజమానిగా గోవిందు కృష్ణారెడ్డి పేరు ఉన్న రవాణాశాఖ రికార్డు

విచారించి చర్యలు తీసుకుంటాం

'ఆటోడ్రైవర్ల సేవలో' పథకం కింద అనర్హులు లబ్ధిపొంది ఉంటే వారిపై చర్యలు తీసుకుంటాం. లబ్ధి చేకూరని అర్హులకు న్యాయం జరిగేలా మరోసారి ప్రభుత్వానికి ప్రతిపాదిస్తాం. అర్హులందరికీ పథకం ద్వారా నిధులు మంజూరయ్యేలా చూస్తాం.
– మనోహర్‌రాజ్, ఎంపీడీఓ, మర్రిపాడు

క్లుప్తంగా

వధూవరులకు ఆశీస్సులు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సాక్షి టీవీ వీడియో జర్నలిస్ట్ వీరభద్ర వివాహ వేడుకను గూడూరులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వధూవరులను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, పార్టీ వెంకటగిరి ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆశీర్వదించారు.

గేదెను ఢీకొని వాహనచోదకుడి మృత్యువాత



అనుమసముద్రంపేట: గేదెను ఢీకొనడంతో వాహనచోదకుడు మృతి చెందిన ఘటన మండలంలోని చిరమనలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఇంట్లో సామగ్రి కొనుగోలు నిమిత్తం గ్రామానికి చెందిన ఉడతా మాల్యాద్రి (44) హసనాపురానికి శనివారం రాత్రి వెళ్లారు. తిరిగి బయల్దేరగా, హసనాపురం – చిరమన మార్గమధ్యలో గేదెను ఢీకొని కిందపడ్డారు. తలకు బలమైన గాయం కావడంతో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి వెంటనే తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అలరించిన మ్యూజికల్ నైట్



నెల్లూరు(బృందావనం): మధుర గాయకుడు కిశోర్‌కుమార్ మ్యూజికల్ నైట్‌ను నగరంలోని పురమందిరంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. తన గానమాధుర్యంతో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన కిశోర్‌కుమార్ వర్ధంతిని పురస్కరించుకొని సింహపురిలో కార్యక్రమాన్ని తొలిసారిగా మహమ్మద్ రఫీ కల్చరల్స్ అకాడమీ అధ్యక్షుడు జావీద్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గాయకులు జీలు, మాబాషా, షబ్బీర్, ఇబ్రహీం, షఫీ, అమానుల్లాఖాన్, మహబూబ్‌బాషా, రమాదేవి, రుబీనా, సుజాత తదితరులు ఆలపించిన గీతాలకు వాద్య సహకారాన్ని రఫీ, దారా సురేష్, కిశోర్, భరత్, మొజి, బాషా తదితరులు అందించారు.

ఇనుప గడ్డర్ల తొలగింపునకు చర్యలు



సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(బారకాసు): అనుమతుల్లేకుండా ఇనుప గడ్డర్లతో చేపట్టిన నిర్మాణ తొలగింపునకు చర్యలు చేపట్టారు. నగరంలోని కనక మహల్ థియేటర్ ఖాళీ స్థలంలో అనుమతుల్లేకుండా ఇనుప గడ్డర్లతో చేపడుతున్న రెండంతస్తుల నిర్మాణంపై టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ క్రమంలో 'అక్రమ నిర్మాణాలను వదిలేసి' అనే శీర్షికన సాక్షిలో కథనం గత నెల 17న ప్రచురితమైంది. దీంతో నిర్మాణాన్ని తొలగించాలని ఆదేశించారు. ఈ తరుణంలో తానే స్వయంగా తొలగించుకుంటానని టౌన్ ప్లానింగ్ అధికారులకు నిర్మాణాదారుడు విజ్ఞప్తి చేశారు. మూడు రోజులుగా జరుగుతున్న తొలగింపు ప్రక్రియ దాదాపు 90 శాతం మేర పూర్తయింది.

ప్రధాని బందోబస్తుకు జిల్లా పోలీసులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 16న పర్యటించనున్న నేపథ్యంలో బందోబస్తు విధులకు జిల్లా నుంచి 310 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ఆదివారం తరలివెళ్లారు. కర్నూలు జిల్లాలోని బహిరంగ సభకు 250 మంది.. శ్రీశైలం పర్యటనకు 60 మంది సిబ్బంది వెళ్లారు.

సవక సాగుపై ఆసక్తి

- పెరుగుతున్న ధరలు
- ఎకరా బారులు రూ.3.5 లక్షలు
- పుదుచ్చేరి నుంచి మొక్కల దిగుమతి



సాగులో ఉన్న సవక తోటలు

పొదలకూరు: సవక సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. గిట్టుబాటు ధరలు లభిస్తుండటంతో విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. గతంలో కావలి, కందుకూరు నియోజకవర్గాల్లో దీనిపై ఉత్సాహం చూపేవారు. ప్రస్తుతం నీటి సౌకర్యం ఉన్న రైతులు ఈ ప్రాంతంలోనూ చేపడుతున్నారు. వరిలో వస్తున్న తెగుళ్లు, పెరిగిన ఖర్చులతో సవకే నయమని భావిస్తున్న రైతులు.. పుదుచ్చేరి నుంచి మొక్కలను తీసుకొచ్చి నాటుతున్నారు. మండలంలోని మొగళ్లూరు, కనుపర్తి, ఆర్‌వైపాళెం, అంకుపల్లి, ఊసపల్లి, ఇనుకుర్తి, ముదిగేడు, వరదాపురం, బత్తులపల్లిపాడు, ఉలవరపల్లి తదితర ప్రాంతాల్లో దీన్ని సాగు చేస్తున్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న మెట్ట ప్రాంతాల్లో ప్రత్యామ్నాయం లేక జామాయిల్ సాగునే చాలా మంది నమ్ముకున్నారు. అయితే నీటి వనరులు లభ్యమవుతున్న ప్రాంతాల్లో సవకపై మక్కువ పెంచుకుంటున్నారు. జామాయిల్‌ను అత్యధికంగా సాగు చేసే ప్రాంతాల్లోనూ సవకకే ఎక్కువ మంది జై కొడుతున్నారు.

ధరలు పైపైకి

సవక ధరలు రెండేళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు బాగా పెరిగాయి. యాజమాన్య ఖర్చులు సైతం ఎక్కువవయ్యాయి. ప్రస్తుతం 15 లేదా 18 అడుగుల బారులు(లావులను బట్టి) ఎకరా సవకలు రూ.3.5 లక్షల నుంచి రూ.నాలుగు లక్షల వరకు పలుకుతున్నాయి. గతంలో ఇది రూ.రెండు లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు ఉండేవి. మొక్క నాటినప్పటి నుంచి నాలుగేళ్ల వరకు నీటి గడులు, ఎరువులను వేయాల్సి ఉంటుంది. పొదలకూరు పరిసర ప్రాంతాల్లో సవక మొక్కలను నాటేందుకు ప్రత్యేకంగా కూలీలను పిలిపిస్తారు. ఒక మొక్కను నాటినందుకు గానూ రూ.1.50 మేర కూలీలకు ఇవ్వాల్సి ఉంటుంది. మొక్కలను రూ.2.5 చొప్పున పుదుచ్చేరి నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి. నిటారుగా ఉంటేనే కొనుగోలు చేసి కోతలు పెడతారు. వంకరగా ఉన్న వాటిని వేరే వ్యక్తులు ముక్కలుగా కోసి నగదు చెల్లించి పట్టుకుపోతారు. ఎకరానికి రైతులకు రూ.1.5 లక్షల వరకు ఖర్చవుతోంది.

తగ్గుతున్న జామాయిల్ సాగు

మెట్ట పొలాలు ఉండి నీటి సౌకర్యం లేని భూముల్లో జామాయిల్ సాగును విపరీతంగా చేపట్టిన రైతులు ప్రస్తుతం తగ్గించుకుంటున్నారు. సాగులో ఇబ్బందులు, ధరలు నిలకడగా లేకపోవడం వంటి కారణాలే కాకుండా భూములు పనికి రాకుండా పోతున్నాయనే ఉద్దేశంతోనూ తగ్గించుకుంటున్నారు. జిల్లాలో అత్యధికంగా 1.2 లక్షల ఎకరాల్లో సాగు ఉండగా, ప్రస్తుతం గణనీయంగా తగ్గుతోందని తెలుస్తోంది. జామాయిల్ టన్ను ప్రస్తుతం రూ.3500 వరకు ఉందని దళారులు వెల్లడించారు.



మొక్కలు

సవకే మేలు



సవక సాగే మేలుగా ఉంది. వరిని పండించేందుకు పెట్టుబడులు అధికంగా అవుతున్నాయి. గిట్టుబాటు ధరలు లభించకపోవడం తదితర కారణాలతో సవకవైపు మొగ్గు చూపుతున్నాం. అన్ని కలిసొస్తే మంచి లాభాలను చూడొచ్చనే ఉద్దేశంతో పంట మార్పిడిని చేపట్టాం.

– పెంచలనారాయణరెడ్డి, రైతు, మొగళ్లూరు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ఆత్మకూరు నియోజకవర్గంలో ఆదివారం చోటుచేసుకున్న రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు తరలించారు.

లారీని అధిగమించే క్రమంలో..

మర్రిపాడు: లారీని అధిగమించే క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన మర్రిపాడు సమీపంలోని నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు.. కర్ణాటకలోని బెళగావికి చెందిన స్క్రాప్ వ్యాపారులు ఉమర్ ఫరూఖ్, ముజహర్, ఇర్షాద్ నెల్లూరు బయల్దేరారు. మార్గమధ్యలోని కంద్రిక సమీపంలో లారీని కారు ఢీకొనడంతో ఫరూఖ్, ముజహర్ గాయపడ్డారు. హైవే అంబులెన్స్ సిబ్బంది సమయానికి రాలేదు. దీంతో చికిత్స నిమిత్తం క్షతగాత్రులను ఆస్పత్రికి ఆటోలో తరలించారు. కాగా కారుకు సంబంధించిన వస్తువులు రోడ్డుపై పడిపోవడంతో రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. మర్రిపాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నుజ్జునుజ్జయిన కారు

ఆర్టీసీ బస్సు ఢీకొని..

ఆత్మకూరు: మలుపు తిరిగే క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తి గాయపడిన ఘటన పట్టణంలోని ఎన్టీఆర్ మున్సిపల్ బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. ఏఎస్‌పేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మలుపు తిరిగే సమయంలో గడ్డం నాగరాజును ఢీకొంది. టైరు కింద ఆయన కాలుపడటంతో నుజ్జునుజ్జయింది. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై జిలానీ ఘటన స్థలాన్ని పరిశీలించారు. నాగరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



లాడ్జిలో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

- నెల్లూరులో అర్ధరాత్రి ఘటన
- 15 మందిని రక్షించిన పోలీస్, ఫైర్ సిబ్బంది
- తప్పిన పెనుముప్పు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అందరూ గాఢ నిద్రలో ఉండగా, లాడ్జిలో అగ్నిప్రమాదం శనివారం అర్ధరాత్రి సంభవించింది. ఈ హఠాత్పరిణామంతో గదుల్లో ఉన్న వారు ఆందోళనకు గురయ్యారు. దర్గామిట్ట పోలీసుల కథనం మేరకు.. కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని బ్లూ మూన్ లాడ్జి రెండో అంతస్తులో గల 102వ గదిలో ఏసీ షార్ట్ సర్క్యూటైంది. శనివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో జరిగిన ఘటనలో గదిలోని ఫర్నిచర్, పరుపులు, దిండ్లు దగ్ధమయ్యాయి. మంటలతో అదే అంతస్తులోని మిగిలిన గదుల్లోకి పొగ దట్టంగా వ్యాపించింది. ఇదే సమయంలో వివిధ గదుల్లో 15 మంది ఉన్నారు. సెన్సార్ సిస్టమ్ ఉండటంతో తలుపులు తెరుచుకోకపోవడంతో కిటికీల్లోంచి చేతులు ఊపుతూ పెద్దగా కేకలేశారు. గమనించిన కొందరు.. పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ టీమ్ వెంటనే చేరుకొని, మంటలు ఆర్పి.. కిటికీ అద్దాలు, తలుపులను పగలగొట్టి 15 మందిని ఎమర్జెన్సీ ద్వారం మీదుగా తీసుకొచ్చారు. ఓ బాలుడ్ని అంబులెన్స్‌లో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. రెస్క్యూ ఆపరేషన్‌ను ఎస్పీ అజిత స్వయంగా పర్యవేక్షించారు. పొగను పీల్చడంతో ఆస్పత్రుల్లో పలువురు చికిత్స పొందుతున్నారు. కాగా లాడ్జిని విశ్రాంత ఏఎస్పీ పమిడి మధుసూదన్‌రావుకు చెందిందిగా గుర్తించారు. ఫైర్, రెస్క్యూ టీమ్ అధికారులు చంద్రశేఖర్, శ్రీనివాసులు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సహాయక చర్యలు



పర్యవేక్షిస్తున్న ఎస్పీ అజిత

మహిళల ఆరోగ్యాన్ని కాపాడాలి

నెల్లూరు(అర్బన్): మహిళల ఆరోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా డాక్టర్లు కృషి చేయాలని పలువురు వైద్యులు పేర్కొన్నారు. విష్ 2025 ఉమెన్స్ ఇన్‌ఫెర్టిలిటీ సర్జరీ హార్మోన్ అనే అంశంపై చెముడుగుంట సమీపంలోని గ్రిడ్స్ ఫంక్షన్ హాల్లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సు ఆదివారంతో ముగిసింది. నెల్లూరు మెనోపాజ్ సొసైటీ, ఆబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీ సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లైవ్ ఎండోస్కోపీ వర్క్‌షాపును నిర్వహించారు. నగరంలోని ఓ ఆస్పత్రిలో స్త్రీలకు సంబంధించిన అత్యంత క్లిష్టతరమైన ఆపరేషన్లను సదస్సుకు హాజరైన డాక్టర్లు స్క్రీన్ ద్వారా పరిశీలించి పలు అంశాలపై చర్చించారు. జాతీయ స్థాయి డాక్టర్లు పరీక్షిత్ టాంక్, ప్రతాప్, పళని అప్పన్, అర్చనాబేసర్, అంజూసోనీ, అనితాషా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు పల్లంరెడ్డి యశోదర మాట్లాడారు. స్త్రీల ఆరోగ్య రక్షణ, ఆధునిక చికిత్సలను నాణ్యమైన విధంగా అందించేలా నెల్లూరులో జాతీయ స్థాయి సదస్సును నిర్వహించడాన్ని అభినందించారు. ఆర్గనైజింగ్ టీమ్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్లు ఉషా, అపూర్వ, మిథిలశ్రీ, సాయిదీప్తి తదితరులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన డాక్టర్లు

వైద్యమందక పేదల విలవిల

నెల్లూరు(అర్బన్): బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరుతూ ఎన్టీఆర్ (ఆరోగ్యశ్రీ) వైద్యసేవలను ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులు మూడు రోజులుగా నిలిపేశాయి. దీంతో స్పెషాలిటీ వైద్యసేవలందక పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో రూ.200 కోట్లు, రాష్ట్రంలో రూ.2700 కోట్ల బకాయిలున్నాయి. వీటికి వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని, అప్పులు తెచ్చి వైద్యసేవలను అందించలేమంటూ సేవలను నిలిపేసినా, ప్రభుత్వ స్పందన శూన్యంగా మారింది.

పునరుద్ధరించాలని డిమాండ్

ఆరోగ్యశ్రీ సేవలను నిలిపేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని పునరుద్ధరించాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమణయ్య, ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

అక్రమ తరలింపును అడ్డుకునేదెవరు..?

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇసుకను రాత్రీ, పగలనే తేడా లేకుండా స్థానిక టీడీపీ నేతల ఆధ్వర్యంలో యథేచ్ఛగా తరలిస్తున్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను జొన్నవాడ వద్ద ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వేకువజామున పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. దామరమడుగులోని పెన్నా నుంచి టిప్పర్లు, ట్రాక్టర్ల సాయంతో నిత్యం భారీగా తరలిస్తున్నారు. మామూళ్లు అందుతుండటంతో అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీడీపీ రూరల్ అధ్యక్షుడు జగదీష్ అనుచరుల ఆధ్వర్యంలో ఈ వ్యవహారం సాగుతోందని సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



దామరమడుగు నుంచి తరలుతున్న ఇసుక

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.118
లేయర్	రూ.122
బ్రాయిలర్ చికెన్:	రూ.214
స్కిన్‌లెస్ చికెన్:	రూ.236
లేయర్ చికెన్:	రూ.207



పొదలకూరు నిమ్మ ధరలు

పెద్దవి	: రూ.40
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.15

శిక్షణ సరే.. కుట్టు మెషీన్లేవీ..?



శిక్షణ పొందుతున్న మహిళలు (ఫైల్)

- జిల్లాలో 1250 మంది మహిళలకు ట్రెయినింగ్
- నేటికీ ఎదురుచూపులు
- ప్రగల్భాలకే కూటమి నేతల పరిమితం

దుత్తలూరు: ఉచిత శిక్షణ...పూర్తి చేసుకున్న వారికి కుట్టుమెషీన్లతో పాటు సర్టిఫికెట్లను అందజేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం, కూటమి నేతలు ప్రగల్భాలు పలికారు. దీంతో జిల్లాలోని 31 కేంద్రాల్లో 1250 మంది మహిళలు శిక్షణ పొందారు. ట్రెయినింగ్ పూర్తయినా, మెషీన్లు పంపిణీకి నోచుకోవడంలేదు. మూడు నెలలు గడుస్తున్నా, ఇదే పరిస్థితి. బీసీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని బీసీ, ఈబీసీ, కాపు వర్గాలకు చెందిన పేద మహిళలకు శిక్షణ పేరిట హడావుడి చేశారు. మెషీన్లు వస్తాయి.. ఉపాధి పొందొచ్చని ఆశపడిన మహిళలకు నిరాశే ఎదురవుతోంది. వాస్తవానికి శిక్షణకు సంబంధించిన అర్జీలు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వీటిని మున్సిపల్ కమిషనర్లతో పాటు ఎంపీడీఓలకు పంపారు. నిబంధనల మేరకు 18 నుంచి 60 ఏళ్లలోపు వారిని శిక్షణకు ఎంపిక చేశారు.

సిబ్బందికి అందని వేతనాలు

ఒక్కో శిక్షణ కేంద్రానికి ఒక టీచర్‌తో పాటు కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించారు. టీచర్‌కు నెలకు రూ.15 వేలు.. కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.12 వేల చొప్పున వేతనాన్ని మంజూరు చేయాలి. మూడు నెలలకు గానూ ఒక నెలకే వేతనాలను అందజేశారని సమాచారం. మిగిలిన మొత్తం ఎప్పుడొస్తుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

పంపిణీ చేస్తాం

జిల్లాలోని 31 కేంద్రాల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఐదు చోట్ల ట్రెయినింగ్ జరుగుతోంది. ఇది పూర్తయిన వెంటనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కుట్టుమెషీన్లను అందజేస్తాం. సిబ్బంది వేతనాలకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేస్తున్నాం.

– నిర్మలాదేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ

సమాజాభివృద్ధికి తోడ్పడాలి

- మాజీ మంత్రి అనిల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సమాజంలో అన్ని వర్గాలకు సేవలందిస్తూ.. అభివృద్ధిలో యాదవ ఉద్యోగులు కీలకపాత్ర పోషించాలని మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. నూతన డీఎస్సీ ఉద్యోగుల సన్మాన కార్యక్రమాన్ని కొత్తూరులోని యాదవ ఎంప్లాయీస్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడారు. అందరూ ఉన్నత చదువులు చదివేలా కృషి చేయాలని కోరారు. డీఎస్సీలో 56 మంది యాదవ ఉద్యోగులు ప్రతిభను చూపడాన్ని అభినందించారు. అనంతరం సర్వీస్ రిజిస్టర్లను అందజేసి సత్కరించారు. సంస్థ వ్యవస్థాపకులు శ్రీనివాసులు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వారిని సత్కరిస్తున్న అనిల్